# ప్రేమస్వరూపుడైన భగవంతుని పొందటానికి ప్రేమనే ఆధారము చేసుకోవాలి

మనసు నిలిపినవాడె పో మానవుండు
బుద్ధినెరిగిన మనుజుండె బుధజనుండు
చెప్పుమాట చేత లొకటైన శ్రేష్ఠుడగును
సత్యమును తెలుపుమాట యీ సాయిమాట

ముక్తికోరి నరుడు ముక్కోటి దేవతల
వేడుచుండుగాని వెతలు బోవు
తనదు లోని అహము తా చంపుకున్న
ముక్తియేల తానె ముక్తికాడె

**దివ్యాత్మస్వరూపులారా!**

మానవుడు ఏ చిన్నకార్యమును సాధించవలెనన్నను ప్రకృతిని ఆశ్రయించవలసివస్తుంది. ఈ ప్రకృతి ఎవరి సొత్తూకాదు. ఇది భగవంతుని సొత్తు. భగవంతుడు సానుకూలుడు కాకుండిన ఏ మానవుడుకూడను, ఎట్టి కార్యమును సాధించలేడు. ఏదో ఒక విధముగా కార్యమును సాధించబూనుటకై కొందరు ప్రయత్నించినప్పుడు యిది విఫలమైపోతూ వుంటుంది. దీనికి చక్కని ఉదాహరణము రామాయణమే! భగవంతుడైన రాముని విస్మరించి సీతను పొందే నిమిత్తమై రావణుడు అనేక విధములైన పాట్లు పడ్డాడు. సీతను పొందుటకై చేసిన ప్రయత్నములన్నియు విఫలమైపోయాయి. విఫలమగుటయేకాక, తన జీవితమును నాశనము చేసుకొనుటయేకాక, తనయొక్క సంతతిని, తన బంధుబలగమును, రాజ్యమును భస్మము గావించుకున్నాడు. భగవంతుడు సానుకూలుడు కావలెనన్న అతనిని ప్రార్థించటమే ప్రధానమైన మార్గము.

srisathyasai vachanamrutam

మానవునియొక్క మనసు ఒక పద్మమువంటిది. ఈ పద్మముపైన మధుకరములనే రెండు తుమ్మెదలు వాలి వుంటాయి. ఇవి రెండు పదములుగా విభజించినప్పుడు 'మధు,' 'కర' అని రెండు పదములు ఏర్పడతాయి. 'మధు' అనగా జలము. 'కర' మనగా సూర్యకిరణము. ఈ పద్మమునకు క్రింద జలము, పైన సూర్యుడు. యీ రెండు లేకుండిన ఈ పద్మము ఏమాత్రము జీవించలేదు. ఈ 'కర'మనే సూర్యకిరణము క్రిందనున్న 'మధు' అనే జలమును పైకి తీసుకోటం తిరిగి క్రిందకు పంపటము జరుగుతూ వుంటుంది. ఈ 'మధుకర' అనే రెండు తుమ్మెదలే 'రామ' అనే రెండక్షరములు. మధురమైన ఈ మధుకరమనే భగవన్నామమును ఎవరు హృదయపూర్వకముగా ప్రేమించి, భావించి, స్మరింతురో వారికి ఏ విధమైన బాధలు వుండవు. అంతేకాక భగవంతుడు వారి హృదయవాసిగా ఏర్పడతాడనేది పరమ సత్యము.

**నామముపైన పరిపూర్ణ విశ్వాసము ఏర్పడినప్పుడే నామిని పొందటానికి వీలవుతుంది**

మానవ జీవితమునకు మహత్తర ప్రక్రియ ఆత్మవిశ్వాసమే! ఈ నామముపైన పరిపూర్ణమైన విశ్వాసము కలిగినప్పుడే నామిని పొందటానికి సాధ్యమవుతుంది.

**తరువ తరువ పుట్టు తరువు ననలంబు**
**తరువ తరువ పుట్టు దధిని ఘృతము**
**తరువ తరువ పుట్టు తనువున తత్త్వంబు**

అనగా రెండు చెట్టుకొమ్మలు ఒకదానికొకటి రాపిడి జరిగినప్పుడే అందులో అగ్ని ఆవిర్భవిస్తుంది. పెరుగును చిలికినప్పుడే వెన్న మనకు సాక్షాత్కరిస్తుంది. తనువును పరిశోధనలు చేసినప్పుడే అందులో భగవన్నామమనే ఒక తత్త్వము ఆవిర్భవిస్తుంది. అయితే, ఈనాడు అట్టి భగవన్నామ తత్త్వమును గుర్తించేవారు చాలా తక్కువ. అనిత్యము, అశాశ్వతము అయిన ఈ జగత్ సంబంధమైన భోగభాగ్యముల నిమిత్తమై మానవుడు తన కాలమును, తన కాయమును, తన కర్మను అర్పితము గావించుకొంటున్నాడు. ఇన్ని విధములుగా శ్రమించి తాను పొందే ఫలితమేమిటో చెప్పలేకపోతున్నాడు.

**నిద్దుర నుండి లేచి మరి నిద్దురపోయెడుదాక పొట్టకై**
**హద్దును పద్దులేక వ్యయమందగ జేయుచు జీవితంబు నీ**

srisathyasaivachanamrutam

**విద్దెల ధారపోసి అరవింద దళాక్షుని విస్మరించి యే**
**పెద్ద సుఖంబు పొందితిరొ ప్రీతిగ యోచన చేయు మానవా!**

కాలమును ఈ విధముగా అపవిత్రము గావించి మనము పొందే సుఖమేమిటో మనకే తెలియకపోవుచున్నది. మానవునియొక్క లక్ష్యమేమిటో, గమ్యమేమిటో గుర్తించుకోలేకపోతున్నారు. ఇట్టి దివ్యమైన, భవ్యమైన, నవ్యమైన మానవత్వమును ధరించి దీనియొక్క గమ్యమును మనము గుర్తించుకోకుండా లక్ష్యమును విస్మరించిన, మనము ఉద్భవించి ప్రయోజనమేమిటి? భగవంతుని నామము నిరంతరము స్మరించినప్పుడే మన హృదయము మెత్తబడి భగవంతుని పాదములు హత్తుకొనే అనగా ప్రింట్సు యిందులో ఏర్పడుతూ వుంటాయి. ఇట్టి నామ స్మరణ లేకపోటంచేతనే హృదయము గట్టిపడుతూ బుద్ధి సూటి అగుచు జీవితమును వ్యర్థము గావింపచేస్తున్నది. ఈనాటి మానవుని హృదయము మధురమైనదిగాను, సున్నితమైనదిగాను, మృదువైనదిగాను మార్చుకోవాలి. ఇది కేవలము ఒక నామచింతనవలన తప్ప అన్యమార్గములో లభ్యము కాదు. నామచింతన చేయుటకు ఏ విధమైన మార్గమునో, ఏ విధమైన నిష్టనో అనేది మనము యోచించనక్కర లేదు. ప్రేమ భావముతో భగవన్నామము వుచ్చరించిన యిదియే అన్ని విధములైన సత్యమును, పవిత్రతను చేకూరుస్తుంది. దేశకాల పరిస్థితుల ప్రభావమునకు మనము ఏ మాత్రమును లొంగనక్కరలేదు. 'సర్వదా సర్వకాలేషు సర్వత్ర హరి చింతనమ్.'

**సర్వవేదములు, సర్వశాస్త్రముల సారమే భగవన్నామము**

భగవంతుడు సర్వవ్యాపకుడు, సర్వజ్ఞుడు. తానులేని స్థానము కాని, తనదికాని వస్తువుకాని ఈ జగత్తునందు కానరాదు. భగవంతుని నామమునకు ఇంత గొప్ప మహిమ ఏర్పడుటకుగల ప్రధానమైన కారణములు మనము విచారించాలి. వేదములు అనంతమైనవి. వీనిని నేర్చుటము చాలా కష్టము. ఈ అనంత వేదముల నుండి ఆవిర్భవించినవే ఉపనిషత్తులు. వీటినే వేదాంతములని పిలుస్తూ వచ్చారు. ఉపనిషత్ సారమే భగవద్గీత. భగవద్గీత అనగా సాక్షాత్తూ భగవంతుడు గానముచేసినపాట. ఈ పాట భగవంతునియొక్క నామముతో కూడినదిగా వుండాలి. సర్వవేదసారము, సర్వోపనిషద్ సారము, గీతయొక్క సారము భగవంతుని నామమే! ఈ నామమును వుచ్చరించినప్పుడే వేద, ఉపనిషత్, భగవద్గీతలుకూడను మనము

sri sathyasai vachanamrutam

వుచ్చరించినవారమవుతాము. సర్వోపనిషత్ సారమైన భగవద్గీతను నమ్ముకొని జీవించక దీనిని అమ్ముకొని జీవిస్తున్నాడు, యీనాటి మానవుడు. కనుక భగవన్నామమనేది కేవలము ఏదో ఒక తృప్తి నిమిత్తమై భగవంతుని అనేక నామములలో ఒక నామాన్ని మనము అనుభవించినట్టుగా భావిస్తున్నాము. కాదు కాదు, సర్వశాస్త్రములు, సర్వవేదములయొక్క సారమే భగవన్నామము. అట్టి నామమును వినగోరి, అట్టి నామమును పొందగోరి, అట్టినామమును చేయగోరి గోపికలు అనేక విధములుగా కృష్ణుని ప్రార్థిస్తూ వచ్చారు.

**వేదసారమంతదీసి నాదబ్రహ్మగను మార్చి**
**వేణువందు తిరుగబోసి పలుకు తేనె లొలుకునటుల**
**పాటపాడుమా కృష్ణా పలుకు తేనె లొలుకునటుల**
**మాటలాడుమా ముకుంద మనసు తీరగా**

అని ప్రార్థించారు. "వేదసారమంత తీసి నాద బ్రహ్మగను మార్చి, వేణువందు తిరుగబోసి, గాన రూపముగను మార్చి పాట పాడుమా కృష్ణా పలుకుతేనె లొలుకునటుల మాటలాడుమా ముకుంద మనసు తీరగా ఓ కృష్ణా!" ఈ విధముగా మాధుర్యముతో కూడిన ఈ నామముచేత నిజముగా మానవులు ఉద్ధరింపబడలేకపోతున్నారంటే ఇది నిజముగా ఒక దురదృష్టమనే చెప్పవచ్చు.

## నామముతో సాధించలేనిది లోకములో ఏదీ లేదు

తీరిక లేకపోయినప్పటికి ఉపనిషత్తులు మనము పఠిస్తున్నాము. ఉపనిషత్తులు ఒక దట్టమైన అరణ్యమువంటివి. ఈ అరణ్యములో దారితప్పితిమా మనము గమ్యము చేరలేము. వేదమనగా శబ్ద ప్రమాణము. వేదము విష్ణు స్వరూపమని యితను అప్రమేయుడు అనగా ఎట్టి ప్రమాణములకు లభించేవాడు కాదు అని చెప్పబడింది. ఇంక గీత. ఈ గీతను మనము ఆచరించి, ఆనందించి, స్మరించి, భజించి, తరించే నిమిత్తమై అందించినది. దురదృష్టవశాత్తు మనము గీతను పారాయణము చేయుటములోనే మన కాలమునంతా వ్యర్థము గావించుతున్నాము. ఆ సారమును నామరూపములో మనము భజించాలి. ఇటువంటి నామస్మరణ మానవునకు అతి సులభమైనది, మధురమైనది, ఆనందమయమైనది. ఏకాంతమైన



srisathyasaivachanamrutam

ప్రదేశములో కూర్చుని భగవన్నామమును హృదయపూర్వకముగా స్మరిస్తూవుంటే అతనియొక్క హృదయము ఆనందములో మునిగిపోతుంది. ఇట్టి ఆనందము మరి ఏ విధమైన మార్గమునందు మనకు లభ్యముకాదు. నారదుడు, తుంబురుడు, మీరా, సక్కుబాయి యిత్యాది పరమభక్తులందరు నామమునే ఆధారము చేసుకొని సంసారమనే సాగరములో నావగా మార్చుకొని గట్టు చేరారు. నామము లేని జీవితముగాని, నామములేని పదార్థముగాని నిజమైన భక్తుడు ఏమాత్రము అంగీకరించడు. రావణసంహారము తరువాత రాముడు అయోధ్యకు వచ్చి పట్టాభిషేకము జరుగుతున్న సమయములో అనేకమందికి అనేక బహుమతులు అందిస్తూ వచ్చాడు. కానీ, హనుమంతునికి ఏ బహుమతి ఇవ్వాలో అతనికి తోచలేదు. అప్పుడు సీత రామునికి హనుమంతుని గురించి జ్ఞప్తి చేసింది.

**రఘుపతి కార్యం బీడేర్చిన కపిరాజ శిఖామణి యితడయ్యా**
**పరి పరి లంకాపురమును జొచ్చి పురమరసిన వాడితడయ్యా**
**పరి పరి విధముల జానకి వెదకిన అమిత పరాక్రముండితడయ్యా**

"ఇతడు కపిరాజు శిఖామణి. రామకార్యములోపల తన జీవితమునే అర్పితము గావించినవాడు. అతనికి ఏ విధమైన బహుమానము అందించలేదే" అనింది. రాములు చెప్పాడు: "అతనికి యివ్వగలిగిన పదార్థములు నా దగ్గర లేవు. సామాన్యమైన మానవులకు ఏదో అంతో యింతో పదార్థముల ద్వారా వారిని సంతృప్తిపరచవచ్చు. నా నామములో లీనమైన హనుమంతునికి నన్ను నేనే యిచ్చుకుంటున్నా"నన్నాడు. అయితే సభ లోపల యింతమందిని సత్కరించి ఈ విధముగా ఒక్క హనుమంతునికి మాత్రమే ఈ ప్రాకృతమైన గౌరవాన్ని అందించలేదంటే అతను చాలా నొచ్చుకోవచ్చును అనే ఉద్దేశ్యముతో సీత తన మెడలోవున్న ముత్యాల హారమును తీసి హనుమంతునికి యిచ్చింది. ఇది చాలా విలువైనది, ప్రాకృతముగా. కానీ, ఆ మాలలోని ప్రతి ముత్యమును ఒక్కొక్కటి కొరుకుతూ కొరుకుతూ పారవేశాడు హనుమంతుడు. అందరు అనుకున్నారు, "అయ్యో! ఈ కోతిబుద్ధి ఎక్కడకు పోతుంది? విలువైన ముత్యములు తాను కొరకటము చెవుదగ్గర పెట్టుకోటము, పారవేయటము ఈ విధముగా చేస్తున్నాడని అందరూ మనసు కష్టపెట్టుకున్నారు. దీనిని గుర్తించిన సీత ప్రశ్నించింది: "హనుమంతా! నీ చేష్టలయొక్క

sri sathyasai vachanamrutam

భావము నేను గుర్తించితిని గాని లోకులు గుర్తించలేరు, దీనికి కారణము చెప్పుమ"ని కోరింది. హనుమ "నా రోమ, రోమము రామనామముతో నిండింది. అట్టి పరిస్థితిలోపల రామనామము లేని ఈ విలువైన ముత్యములు నాకక్కర లేదు. అవి నాకు రాతితో సమానమ"న్నాడు. ఆ విధంగా హనుమంతుడు మహాభక్తుడై రాముని హృదయమును కూడను సాధించిన మహాదీక్షగలవాడై తాను ఒక్క రామనామాన్ని మాత్రమే కోరుతూ వచ్చాడుగానీ ప్రాకృతమైన పదార్థములు ఆశించలేదు. నామముతో సాధ్యముకానిది లోకములో ఏదీ లేదు.

**భగవంతుని సహజమైన హృదయస్థాయిలోనే మనము పొందడానికి ప్రయత్నించాలి**

అయితే ఈ నామమును మనము ఏరీతిగా అనుభవించాలి? భగవంతుని అఖండముగా వర్ణించటముచేత, కీర్తించటముచేత భగవంతుడు మానవునకు మరింత దూరమై పోతున్నాడు. భగవంతునికి వర్ణనలుగానీ, కీర్తించటముగాని నచ్చవు. సహజమైన హృదయస్థాయిలోనే భగవంతుని పొందటానికి ప్రయత్నించాలి. ఆయనను మనము ఏ విధముగా ఎటువంటి ఆర్తితో పిలవాలి? 'ఓ బృందావన విహారీ', 'హే మధురా పుర విహారి!' 'హే దయామయా', 'హే కరుణానిధీ', 'హే కోటి సూర్యసమ తేజస్వరూపా', అని వర్ణించినంత మాత్రమున భగవంతుడు మనకు లభించడు. 'ఓ మిత్రుడా! ఓ ప్రియతమా! ఓ బింబమా! నా స్వరూపమా! నన్ను అనుగ్రహించమ'ని కోరినంతనే పరమాత్ముడు సమీపిస్తూ వుంటాడు. అతనినొక ప్రియునిగా మనము విశ్వసించాలి. అతనిని ఒక మిత్రునిగా మనము విశ్వసించాలి. అతనిని మనకు తోడు నీడగ వుండిన బింబముగా విశ్వసించాలి. ఆయనతో హృదయస్థాయిలో సాన్నిహిత్యము పెంచుకోవాలి. ఆనాటి మహర్షులు, యోగులు భగవంతుడు ఎక్కడో దూరముగా ఉన్నాడనే భావనతో ఈ విధముగా వర్ణించటముచేతనే వందల వందల సంవత్సరములైనప్పటికిని భగవంతుడు వారికి సాక్షాత్కరించలేదు. గోపికలు ఇందుకు విరుద్ధంగా 'గోపాలా! గోపాలా!' అని అతని సహజమైన నామముచేతనే అతనిని పిలుస్తూ అతనితో సంభాషణలు సలుపుతూ అతనియొక్క అండదండలను పొందుతూ వచ్చారు. కనుక, భగవంతుని వర్ణించకూడదు. కారణమేమిటి? వర్ణించినప్పుడు ఆయన ఎవరో ఒక అపరిచిత వ్యక్తిగా కనిపిస్తాడు. మనకు, భగవంతునికి అనేక జన్మలనుండి సంబంధము వుంటుండాది. ఆయన మనకు పాతవాడే!

sri sathyasai vachanamrutam

మనము ఆయనకు పాతవారమే! కొత్తవారము కాదు. 'మానవ' అనే పదమునందే మనము పాతవారమనే అర్థాన్ని రూపొందింపచేస్తున్నది. మా-కాదు, నవ-క్రొత్త. క్రొత్త కానివాడే మానవుడు అని చెపుతుంది. మనకు అనేక జన్మలలోపల అనేక తల్లులు, అనేక బిడ్డలు వుంటారు. ఎందరు తల్లులను మనము కోల్పోయినామో, ఎందరు తండ్రులను మనము కోల్పోయినామో! వారికి, మనకు ఏ విధమైన సంబంధము లేదు. కాని ఎన్ని జన్మలు ఎత్తినప్పటికిని భగవంతుడు మాత్రము ఆనాడు యేనాడు, మనతోనే వున్నాడు.

**భగవంతుని ప్రేమలేని మర్యాదలు, మన్ననలు అక్కర లేదు**

మన యింటికి క్రొత్తగా ఎవరైనా ఒక మిత్రుడు వచ్చినప్పుడు 'రండి! కూర్చోండి!' అని అంటాము. వారికి చాపలు వేయటమో, కుర్చీలు అమర్చటమో ఈ విధమైన గౌరవాన్ని మనము అందిస్తూ వుంటాము. అదే పాత స్నేహితుడైతే 'రారా, పోరా, కూర్చోరా' అనే రీతిగా మనము పదములను ఉపయోగపెడతాము. ఈ గౌరవమన్ననలన్నీకూడను భగవంతుని మనము కొత్తవానిగా చూచుకుంటున్నామనే విషయాన్ని తెలియజేస్తున్నాయి. అదే మనలోవున్న దోషము. భగవంతుడు నీతో సన్నిహిత సంబంధ బాంధవ్యము కలవాడు, నీ శ్రేయోభిలాషి మరియు నీ ఆప్తమిత్రుడు. అలాంటివానిని ఈ విధముగా కృత్రిమమైన మర్యాదలు, గౌరవించటము చేయడంచేత నాకీ స్నేహము అక్కరలేదని వెళ్లిపోతూవుంటాడు. మనసు విప్పి ప్రేమచేత తనను ఆప్యాయంగా ఆహ్వానించాలి. కనుక, ప్రాచీన భక్తులందరూకూడను భగవంతుని ఏకవచనములో వేడుకుంటూ, ఆర్తితో పిల్చుకుంటూ, హృదయస్థాయిలో అనుభూతులు పొందుతూ అనుభవిస్తూ వచ్చారు. త్యాగరాజుకూడను అట్లే రామచంద్రునితో సాన్నిహిత్యం అనుభవిస్తూ వచ్చాడు.

**రామ నన్ను బ్రోవరా! రామ నన్ను బ్రోవరా!**
**ప్రేమతో లోకాభిరామ నన్ను బ్రోవరా!**

అని వేడుకున్నాడు. ఏకవచనముగానే 'రామచంద్రా! నన్ను బ్రోవరా' అని ఈ విధముగా ప్రేమతో పిలుస్తూ వచ్చాడు. రాములు కనిపించని సమయములోకూడను ఆయనను ఏకవచనముగానే సంబోధిస్తూ వచ్చాడు.

**నిన్ను యెందు వెదకుదురా! రామ నిన్నెందు వెదుకుదురా**

srisathyasaivachanamrutam

**నిన్ను నేనెందు వెదుకుదురా!**

ఎక్కడ చూచినా వుండినవానిని వెతికేది ఎక్కడరా? ఈ విధమైన ప్రేమసంబంధమైన దానిలో గౌరవమనేది అక్కడ ఏమాత్రము లభించదు. ప్రేమ పెరుగుతుంది, గౌరవ, భయములు తరుగుతాయి. అట్టి సన్నిహిత సంబంధమునే భగవంతుడు ఆశిస్తాడు. ప్రేమలేని మర్యాదలు అక్కరలేదు. అన్నింటికిని ప్రేమయే, ఈ ప్రేమతో, భావపరిపుష్టితో నామాన్ని స్మరించటముచేత భగవంతుడు సన్నిహితుడైపోతాడు.

**పరిపూర్ణ ప్రేమతో నిండిన మనిషికి పదములు కేవలము ఏకవచనంగానే వస్తుంటాయి**

నామము స్మరిస్తూ వుండగా భక్తుడు తన్మయాత్ముడైపోతాడు. మత్తుడైపోతాడు. వున్మత్తుడైపోతాడు. ఈనాడు లోకములో నిరంతరము నామస్మరణ చేస్తూ భగవంతుని అనేక విధములుగా చింతిస్తూ ఆనందము పొందేవారిని చూచి ఈతనొక పిచ్చివాడని అనుకుంటారు. ఈనాడు లోకములో పిచ్చివారు, పిచ్చివారు కానివారుకూడను సమంగానే వున్నారు. కొంత విచారించి చూస్తే పిచ్చివారే ఉత్తములుగా కనిపిస్తున్నారు. పిచ్చివానికి బాధ్యత తక్కువ. కర్మలు తక్కువ ఆచరిస్తాడు. కనుక, తెలివితేటలు కలిగినవారికంటె పిచ్చివారే వుత్తములని గుర్తించవచ్చు. ఈ 'పిచ్చి' అనే పదముకూడను చాలా ముచ్చటైన పదము. పిల్లవాడు ఏదో ఆడుకుంటూ వుంటే 'ఏమిరా! పిచ్చివాడా! ఏమిట్రా నీ ఆట', అంటాడు తండ్రి. పిచ్చివాడా అనటము ముద్దైన మాటనే కాని వాడు పిచ్చివాడని అర్థము యిచ్చే మాటకాదు. దూరముగా ఉన్న కొడుకునుండి ఇంకను జవాబు రాలేదనో లేక పిల్లవాడు ఎట్లావున్నాడనో భార్య ఏడుస్తుంటే 'పిచ్చిదానా! నేడో రేపో వస్తుంది ఎందుకేడుస్తావు?' అంటాడు, భర్త. 'పిచ్చిదానా' అన్నంతమాత్రమున భార్యకు పిచ్చిపట్టి పోలేదు. కాని, యిది ఒక ముచ్చటైన పదము. కనుక భగవంతుని నామముతో వున్మత్తుడైనవానిని 'పిచ్చివాడా' అని పిల్చటము పిచ్చికాదిది, ప్రేమతో పిల్చటము. ఎవరేమి పిల్చినప్పటికిని లోకవాక్యములకు మనము ఏ మాత్రము వెరువనక్కర లేదు. మనయొక్క ప్రేమకు, విశ్వాసమునకు, సంకల్పమునకు సరైన మార్గమును మనము వెతుక్కుంటూ పోవాలి. లోకానికి వెరుస్తే మనకు లభించేది ఏముంది? ధైర్యముతో ప్రేమచే విశ్వాసముచే భగవంతుని నామస్మరణ నిరంతరము చేస్తూ రావాలి. ఈ ప్రేమలోపల ఒక

srisathyasaivachanamrutam

విధమైన సన్నిహిత సంబంధము ఏర్పడిపోతుంది మనకు. లౌకిక రీత్యా భగవంతుని ఎల్లప్పుడు ఎంతో గౌరవంగా, మర్యాదగా చూచుకోవాలి. కాని, ఏకాంతమైన సాధనయందు ఆయనను ఆప్తునిగా, ఏకత్వముగానే మనము విశ్వసించాలి. కృష్ణుడు, ఉద్ధవునికి సన్నిహిత సంబంధుడే! కాని, ఉద్ధవుడు కృష్ణుని భయముతో, గౌరవముతో కేవలము ఒక విధమైన గంభీరముతో చూస్తూ వుండేవాడు. ఆ విధముగా చూడటంచేత అతనిని సమీపించ లేదు కృష్ణుడు. ఈ విధంగా ఉద్ధవుడు కృష్ణునికి స్నేహితుడు మాత్రమేగాని సన్నిహితుడు కాలేకపోయాడు. కృష్ణుడు ఒక సందర్భంలో "మధురావాసులు, ద్వారకా వాసులు, లోకములోని సమస్త ప్రజలుకూడను నాకు ప్రేమ పాత్రులే, నాకు ప్రాణ సమానులే! కాని, నా నామమును నిరంతరము స్మరించే గోపికలు మాత్రము నా ప్రాణము" అన్నాడు. ప్రాణసమానమునకు, ప్రాణమునకు ఎంత వ్యత్యాసము వుంటుండాది! పరిపూర్ణ ప్రేమతో నిండిన మనిషికి పదములు కేవలము ఏకవచనంగానే వస్తూవుంటాయి. ఉద్ధవుడు యశోద దగ్గరకు వచ్చాడు. "నాయనా! గోపాలుడు ఎట్లావున్నాడు మధురలో?" అని ప్రశ్నించింది యశోద. "అమ్మా! సకల శక్తి సంపన్నుడైన కృష్ణునకు ఏమికొరత? ఆ మధురాపుర విహారి చక్కగానే వున్నాడు. ముని మానస సంచారి. అతనికి ఏ కొరతలు లేవు. గోపీ జన వల్లభుడు అతనికి ఏ కష్టములు లేవు. ఆనందలోలుడు. నిరంతరము ఆనందముతో తాండవమాడుతున్నాడు," అని జవాబిచ్చాడు ఉద్ధవుడు. ఈ విధముగా చెప్పే జవాబులు యశోదకు ఏమాత్రము గిట్టలేదు. "ఎవరా మధురాపురవిహారి? వారిపేరు నాకక్కర లేదు. ముని మానస సంచారి ఎవరో నాకు తెలియదు. వారి క్షేమ సమాచారములు నేను ప్రశ్నించలేదు. నా గోపాలునియొక్క క్షేమ, సమాచారములు నేను ప్రశ్నిస్తున్నాను" అని చెప్పింది. 'గోపాలా! గోపాలా!' అనే నామముతప్ప అన్యబిరుదులుగాని, అన్యవర్ణనలుగాని ఆమె ఏ మాత్రము అంగీకరించేది కాదు.

**పసికందులగు మీపై కంస భూపాలుండు**
**మదగజంబు వదల మనసెటుల ఒప్పెనో**
**కన్ననాటిమొదలు కష్టాల పాల్జేసి**
**కంటితో చూడు మా కర్మఫలమదేమో**
**నరరాక్షసులు చేరి పురవీధులన్ తరుమ**

srisathyasaivahini.org

### బాధలెన్ని పడిరో బలరామ కృష్ణులు

ఈ విధంగా ఆమె నిరంతరం కృష్ణుని క్షేమ సమాచారములను గురించి చింతిస్తూ వుండేది. 'బలరామ, కృష్ణ' అనే పేర్లుతప్ప 'ఓ భగవంతుడా! ఓ సాక్షాత్ స్వరూపా!' మొదలగు పదములు ఆమె ఏ మాత్రము వుచ్చరించలేదు. అనగా ఒక్క నామములో సర్వస్వము యిమిడి వుంటున్నాది.

### భగవంతునియందు పరిపూర్ణ ప్రేమను పొందినప్పుడు ఆయనను ఒక హక్కుతో అడుగవచ్చు

సహజమైన నామాన్నే మనము వుచ్చరించాలి. సహస్ర నామాలని మనము ఎన్నో నామాలు చెప్తూ వుంటాము. యివన్నీ కేవలము మన తృప్తికోసము చేయటమే! వున్నది ఒకే నామము, అదే 'గోపాలా, శ్రీరామ' అనే పదములు. ఇట్టి సహజ నామముతో వుచ్చరించిన మానవులకు సులభంగానే అతి సూక్ష్మముగానే ప్రత్యక్షమవుతాడు, భగవంతుడు. సహజ జీవులను ఉద్ధరించే నిమిత్తమై సహజ నామము ధరించి సహజమైన ప్రేమతో సన్నిహితుడౌతాడు. తండ్రి గొప్ప అధికారిగా వుండవచ్చు. అతనికి గొప్ప జీతము రావచ్చును. అనేక భవనములు వుండవచ్చు. బ్యాంకులో లక్షల సంపత్తి వుండవచ్చును. కానీ కుమారుడు వెళ్లి నాకు చొక్కా కుట్టించమని అడగాలనుకున్నప్పుడు 'నాన్నా! నీవింత గొప్పవాడవు, నీవు లక్షాధికారి, నీకు భవనములంతా వున్నాయి. నీకింత income వస్తుంది నాకొక చొక్కా కుట్టిస్తావా,' అని అడగడు. "నీకు జీతము యిస్తున్నారో లేదో నాకు అక్కర ఏలేదు. నీకు భవనములు వున్నాయో లేదో నాకు అక్కర లేదు. నీ దగ్గర ఎంత ధనము వుందో నాకు అక్కర లేదు. నాకు చొక్కా కుట్టించు", అని ఒక హక్కుతో అడిగే స్వభావము, ఈ భగవంతుని యొక్క నామము. భగవంతుని మనము హక్కుతో అడగాలి. ఈ హక్కు సంపాయించుకోటమే ప్రేమయొక్క తత్త్వము. పరిపూర్ణ ప్రేమ మనము పొందినప్పుడు ఆ హక్కు తనంతట తానే లభిస్తుంది.

### ప్రేమ ఒక్కటే మనలను భగవంతుని సన్నిధికి చేర్చుతుంది

దివ్యాత్మ స్వరూపులారా! మనము భగవంతుని పొందాలనుకుంటే ఏ శాస్త్రములో, ఏ ఉపనిషత్తులో, ఏ వేదములో, ఏ భగవద్గీతనో వల్లించనక్కర లేదు. భగవంతుడు అతి సులభ ప్రియుడు. మన ధన, కనక, వస్తు, వాహనాదులకు లభించేవాడు కాదు. కేవలము ప్రేమకు

sri sathyasai vachanamrutam

మాత్రమే సన్నిహితుడౌతాడు. భగవంతుని పొందాలనుకుంటే ఎన్నో విధములైన పూజలు చేయనక్కర లేదు. ఇవన్నీ కాలమును సార్థకము చేసుకొనే నిమిత్తమై చేసే కర్మలు మాత్రమే. కర్మను పవిత్రము చేసినప్పుడు కాలముకూడను పవిత్రముచేసినవారమవుతాము. ఈ కర్మలన్నియు 'చిత్తస్యశుద్ధయే కర్మః.' చిత్తశుద్ధిని గావించేవేగాని, భగవంతుని సన్నిహితము గావించేవిగావు. ప్రేమ ఒక్కటి మాత్రమే తనయొక్క సన్నిధికి లాక్కుపోతుంది. ఆ ప్రేమను స్వార్థరహితమైన ప్రేమగా మనము అభివృద్ధి చేసుకోవాలి. స్వప్రయోజనమైన ప్రేమగా మనము అభివృద్ధి చేసుకోరాదు. ప్రేమకు ప్రేమయే సాటి. భగవంతుడు ప్రేమస్వరూపుడు. అట్టి ప్రేమస్వరూపుని పొందటానికి ప్రేమయే ఆధారముగాని మరొకటి కాదు. ప్రకాశించే చంద్రుని మనము చూడవలెనంటె టార్చిలైటో, హరికెన్‌లైటో తీసుకొని చంద్రుని చూడనక్కర లేదు. చంద్రుని ప్రకాశము ద్వారానే చంద్రుని చూడాలి. భగవంతుడు ప్రేమస్వరూపుడు కనుక ప్రేమద్వారానే పొందాలి. ప్రేమలేని యజ్ఞయాగాది క్రతువులుగాని, ప్రేమలేని దానధర్మాలు తపస్సులుగాని, కేవలము కృత్రిమమైనవే! కనుకనే భగవంతుని సన్నిహితునిగా, నిరంతరముకూడను తనలోనే వుండినవాడుగా మనము విశ్వసించాలి. 'భగవంతుడా! నీకు, నాకు ఎడబాటు లేదు. నీవు వేరు, నేను వేరు కాదు. నీ ప్రేమయందు నా ప్రేమ వున్నది. ఈ రెండు ప్రేమలు కలసినప్పుడు మనము ఏకమైనవారమేగాని భిన్నమైనవారము కాము. కనుక, గోపికలు ఈ విధమైన భావముచేతనే భగవత్ స్వరూపాన్ని పొందగలుగుతూ వచ్చారు.

**వృక్షంబువై నీవు వర్థిల్లుచుండిన**
**వల్లికనై నేను అల్లుకొందు**
**పుష్పంబువై నీవు పొలుపొందుచుండిన**
**తుమ్మెదనై నేను తిరుగుచుందు**
**అనంతమైనట్టి ఆకాశమే నీవైన**
**చిన్న చుక్కగ నేను చెలగుచుందు**
**వర సముద్రుడవే నీవై యుండిన**
**వాహినియై నేను ఐక్యమగుదు**
**మేరు పర్వతమే నీవైన పరచుకొని**

srisathyasaivachanamrutam

**పారెదను నేను సెలయేరునై**

ఈ విధమైన సన్నిహిత సంబంధమును కోరినవాడే నిజమైన భక్తుడు. ఇది ఒక నామముచేతప్ప మరొక దానితో కట్టుబడదు. కనుక నామస్మరణ, నామస్మరణ. నామస్మరణను చాలామంది సులభముగాకాని ఒక విధమైన తేలికభావంతోగాని చూస్తూవుంటారు. దీనిని అలక్ష్యముగా భావిస్తూ వుంటారు. “నామము చేస్తే వచ్చే ఫలితమేమిటి? వేదము చెప్పండి, భగవద్గీతలోని శ్లోకము చెప్పండి,” అంటూ వుంటారు. వేదము, భగవద్గీత చెప్పకోకూడదని చెప్పటం కాదు. అదికూడను ప్రేమతోనే చెప్పాలి నీవు. వేదాన్ని నీవు చదవాలని ఆశించినప్పుడు అందులో భగవంతుని ప్రేమ సంబంధమైన స్తోత్రములు వున్నాయనే దృష్టితో చూడాలి. ప్రేమలేనిదే మనము ఏమాత్రము అంగీకరించుటకు వీలుకాదు.

**ప్రేమరహిత మరు భూములలో**
**ప్రేమాంకురములు పెంపొంద**
**ప్రేమావేశముతో**
**ప్రేమ సుధావర్షము వర్షింపగ**
**ప్రేమనదులు ప్రవహింపగ**
**మురళీగానము చేయగదే**
**కృష్ణా గానము చేయగదే**

“మా హృదయాలు ప్రేమరహితంగా వుంటున్నాయి. ఇటువంటి ప్రేమరహితమైన భూములలోపల ప్రేమ జలమును పెట్టి మెత్తపరచు. అందులో ప్రేమ మొక్కలే నాటు. ప్రేమ జలమే పోయి, ప్రేమ వర్షమే కురిపించు. అప్పుడు నా ప్రేమ నదలు ప్రవహించి నీలో ఐక్యమైపోతాయి.” అని గోపికలు కృష్ణుని ప్రార్థించారు. కనుకనే ప్రేమ, ప్రేమ. ప్రేమకు మించినది జగత్తులో లేదు. ఎన్ని విధములైన ధనధాన్యములు భగవంతునికి అర్పితము చేసినాగాని తాను అంగీకరించడు. అదియే తులాభారముయొక్క అంతరార్థము. ఎన్ని విధములైన ఆభరణములు వేసినప్పటికిని కృష్ణుడు కించిత్తైనాకూడా కదలలేదు. రుక్మిణి వచ్చింది.

“పత్రమో పుష్పమో ఫలమో తోయమో భక్తి కలిగినవారికి నీవు వశుడవగుట సత్యమేని

sri sathyasai vachanamrutam

కృష్ణా! ఈ తులసీ దళమునకు నీవు తూగుదువు గాక!" అంటూ ఒక తులసీదళం త్రాసులో ఒక ప్రక్క వేసింది. పత్రమో-నాదేహము నీకర్పితము. పుష్పము-నాహృదయము పుష్పము. ఫలము-నామనోఫలము. తోయమో-నాయొక్క ఆనంద బాష్పములు. ఇవన్నీ ఒక్క నామముతో నీకర్పితము చేస్తున్నాను" అనింది. ఒక్క నామముచేత సర్వము అర్పితము గావించుకోవచ్చు. ప్రేమలేని అర్పణము తాను అంగీకరించదు. భగవంతుని ప్రేమతో నామస్మరణ చేస్తుంటే యింతకంటె మించిన సులభమార్గము మరొకటి లేదు.

ప్రేమస్వరూపులారా! ప్రేమచేత, నామస్మరణచేత భగవంతుని వశపరచుకొనవచ్చును. ఎటువంటి అమాయకులైనప్పటికి, మూర్ఖులైనప్పటికి, విద్యావంతులైనప్పటికి ప్రేమ సర్వులయందు వుంటుంది. ప్రేమ సర్వజీవులయందు, వృక్షములందు ఫలించే ఫలము. ఆ ప్రేమ ఫలము అయితే ఆ ఫలముపైన ద్వేషము, అసూయ, క్రోధము యిత్యాది దట్టమైన చర్మము కప్పుకొని వుంటుంది. అందువల్లనే అందులోని మాధుర్యము మనకు అనుభవమునకు రావటం లేదు. ఆ తోలును వలిచి పారవేసినప్పుడే ఆ మధురమైన సారము మనకు లభ్యమవుతుంది. కనుక, రాగద్వేషాది గుణములను మనము దూరము చేసి భగవంతుని రాగమునే మనము గానముగా తీసుకున్నామంటే, భగవంతుని నామమే మనము ఆధారముగా తీసుకున్నామంటే, భగవంతుని నీవు వెతకనక్కర లేదు. అతను ఎల్లప్పుడు సన్నిహితుడై వుంటాడు.

**నామస్మరణ సర్వమత సమ్మతమైనది**

ప్రేమస్వరూపులారా! భగవంతుడు సర్వత్ర నిండివున్నాడు. చిన్న ఉదాహరణము. కొద్దిగా నిప్పు మనము చెంతన పెట్టుకున్నాము. కానీ, దానిని మనము అలక్ష్యముగా పెట్టుకున్నాము. అలక్ష్యముగా వుండినప్పుడు ఆ నిప్పునుండి నివురు వచ్చింది. ఆ నివురు నిప్పును కప్పింది. ఆ నివురు ఎక్కడనుండి వచ్చింది? నిప్పునుండి వచ్చిన నివురే నిప్పును కప్పింది. అయితే నివురు, నిప్పులోపల వుంది. వుప్ అని వూదినప్పుడే ఆ నివురు పోతుంది, నిప్పు కనిపిస్తుంది. అదేవిధంగా మనయందే దైవనామమనే రత్నము ప్రకాశిస్తూ వుండాది. నామరత్నమును మనయందే ఉంచుకుని దానిని మనము అలక్ష్యము చేశాము. అందువలననే మాయ అనే నివురు దానిపై కప్పుకొంది. ఆ మాయను దూరముగా నెట్టితే అదే ప్రకాశిస్తుంది.

sri sathyasaivachanamrutam

ఆ మాయను నెట్టటమే స్మరణ. ఆ నామస్మరణ చేస్తూ చేస్తూ వుంటే ఆ నివురు దూరమై పోతుంది. ఆ నామరత్నము మన కంటికి కనిపిస్తుంది. దానితో సర్వానందము మనము అనుభవిస్తాము. కనుక నామస్మరణ దైవాన్ని సన్నిహితుని గావించుకోటానికి సులభమైన మార్గము. అన్ని మతములవారు దీనిని అంగీకరించారు. సర్వమత సమన్వయమైనది ఈ నామము. యోగము, ప్రాణాయామము మొదలగు సాధనలు మన భారతీయులు తప్ప ఇతర మతములవారు అంతగా అంగీకరించరు. అయితే నామస్మరణను క్రిష్టియన్సు అంగీకరిస్తున్నారు, ముస్లిములు అంగీకరిస్తున్నారు, బుద్ధులు అంగీకరిస్తున్నారు, జైనులు అంగీకరిస్తున్నారు, సర్వులు అంగీకరిస్తున్నారు. వారి వారి మతానుగుణ్యముగా క్రిష్టియన్సుకూడను ఒక మాలను పెట్టుకొని నామస్మరణ చేస్తూ వుంటారు. ముస్లిములుకూడను మాలను పెట్టుకొని నామస్మరణ చేస్తూవుంటారు. సిక్కులుకూడను మాలను పెట్టుకొని నామస్మరణ చేస్తుంటారు. కనుక స్మరణే తరణోపాయము. సర్వమత సమ్మతము, సర్వమత సమన్వయము. ఇదే మానవులందరిని ఐక్యము గావిస్తున్నాది. అది సమైక్యత కలిగించే శక్తి కలది. అట్టి నామాన్ని వుచ్చరించి భగవంతుని సన్నిహితుని గావించుకొని సంతోషమును అనుభవించండి. ఇది సులభ మార్గము. ఇంతకంటె సులభమార్గము యింకొకటి లేదు.

**(తేదీ. 17-10-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam